# జ్ఞానోదయం

రాజా

**శివరాం ఓ మినీ దొంగ. కాకపోతే అతని పద్ధతులు కొంచెం విచిత్రంగా ఉండటం చేత ఇప్పటి దాకా పట్టుబడలేదు.**

ఈనెల్లో ఖర్చు వెయ్యిరూపాయలుందనుకుంటే కరెక్ట్‌గా వెయ్యిరూపాయలు మాత్రమే సంపాదిస్తాడు. దానిక్కూడా చాలా పకడ్బందీగా ప్లాన్ వేస్తాడు. లక్షాధికారుల ఇళ్ళు ఓ రెండు ఎన్నుకొంటాడు. అర్థరాత్రో, తెల్లవారురుఝామునో ఏదో ఓ టైమ్‌లో 'చొరబడి' ఓ అయిదు వందలు గిట్టేట్టు దొంగతనం చేసి వస్తాడు. ఒకసారి చేసిన ఇంట్లో మరోసారి వీలయినంతవరకు వెళ్ళడు. లక్షలకి లక్షలు మూల్గే చోట ఓ అయిదు వందలు మిస్సయినా పెద్దగా పట్టించుకోరు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం చేత అతగాడు పట్టుబడలేదు.


కాకపోతే టెన్త్‌క్లాస్ వరకూ చదువుకున్నాడు. ఇంకా చదువుకోలేకపోయానని, చాలా మందిలాగ వైట్ కాలర్ జాబ్ చెయ్యలేకపోయానని బాధపడుతూ ఉంటాడు. తను చేస్తున్న ఈ దొంగతనంవల్ల ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడతానని తెలుసు. అంచేత వీలయినంత త్వరలో ఓ మంచి వృత్తిలో స్థిరపడిపోదామని కోరుకుంటూ ఉంటాడు. దొంగతనం చేయని ఖాళీ రోజుల్లో ఈ విషయాలమీదికి సాగుతుంది అతని ఆలోచన, అన్వేషణ.

ఈ నేపథ్యంలో ఓ రోజు—సారీ... ఓ తెల్లవారుఝామున ఓ ఇంట్లో ప్రవేశించాడు శివరాం. ఇంట్లో ఎవరూ ఉన్నట్టుగా లేదు. అంచేత పని సులువుగానే అయిపోయింది. ఇక బయల్దేర్దాం అనుకొంటుండగా అప్పుడొచ్చిందతనికి సందేహం.

ఇంట్లో ఎవరూ లేకపోతే బైట తాళం పెట్టి ఉండాలిగా. మరి అలా లేదు కాబట్టి ఇంట్లో ఎవరో ఉన్నారన్నమాట. వారు ఎవ్వరూ కనిపించటం లేదంటే దానర్థం?

ఒకవేళ తనకన్నా ముందెవరైనా వచ్చి ఇంట్లో ఉంటున్న వాళ్ళని హత్యచేసి దోచుకొని వెళ్ళిపోయారేమో? అలా అయితే రేపొద్దున దర్యాప్తులో తన వేలి ముద్రలు కూడా దొరుకుతాయేమో? పోలీసు కుక్కలు వాసనబట్టి తన ఇంటికొచ్చి తనని పట్టి ఇస్తాయేమో?

ఈ ఆలోచన రాగానే ఎందుకైనా మంచిదని




ఓసారి ఇల్లంతా చూసి వెళితే మనశ్శాంతిగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చి ప్రతిదీ చూడటం మొదలుపెట్టాడు శివరాం.

ఓ గదిలో వీడియో చూస్తూ రాసేసుకుంటున్నాడో వ్యక్తి. ఆ వేళప్పుడు వీడియో చూస్తూ ఉండటం, అదీ రాసుకుంటూ చూడటం ఇవన్నీ ఆశ్చర్యంతో కూడిన ఆసక్తిని కలిగించాయి. తాను దొంగతనానికి వచ్చానన్న సంగతి మర్చిపోయి మరి కొంచెం ముందుకి వచ్చేశాడు.

తన వెనక ఎవరో ఉన్నారన్న అనుమానం రాగానే రాసుకుంటున్న ఆ వ్యక్తి దివాలున లేచి వెనక్కి తిరిగాడు. ఊహించని ఆ పరిణామానికి బెదిరిపోయి పరుగెత్తబోయాడు శివరాం.

"ఆగు కదిలావో చచ్చేవన్నమాటే" అన్నాడా వ్యక్తి.

వెనక్కి తిరిగాడు శివరాం. ఆ వ్యక్తి చేతిలో పిస్టల్ ఉంది. అప్రయత్నంగానే చేతులెత్తుతూ ఉండగా ఎదురుగా ఉన్న ఆ వ్యక్తి అన్నమాట గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

పట్టుబడి పోయిన వ్యక్తి నవ్వుకోవటం ఆశ్చర్యాన్ని కలిగించిందా వ్యక్తికి.

"ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగాడు గద్దింపు స్వరంతో.

"కదిలావో చచ్చేవన్న మీ మాట గుర్తొచ్చి" అన్నాడు శివరాం.

"అందులో తప్పేం ఉంది?"

"కదిల్తే బతికున్నట్టు లెక్క. అంచేత కదిలేవో చచ్చేవన్నమాటే అని ఎలా అంటారు కదిలావో ఛస్తావ్ అని అనాలి మీరు".

●●●

**మీరు రచయితలు కదా! సొంతంగా ఊహించి రాయకుండా ఇలా కాపీ కొట్టేసి రాస్తే ఎలా?**

●●●

అర్ధం చేసుకున్న ఆ రచయిత శివరాంని మనసారా దీవించాడు.

విస్వెరపోయాడా వ్యక్తి. పిస్టల్ ని ఎడం చేతిలోకి మార్చుకొని కుడి చేతితో పెన్ను అందుకుని నోట్ చేసుకుని ''ఇంతకీ ఎవర్నువ్వు?'' అన్నాడు.

''దొంగని'' అన్నాడు శివరాం.

''ఏ మాత్రం దొంగిలించావు ఈ ఇంట్లో?''

''ఓ అయిదు వందలు''.

''అదేం అంత తక్కువ!? అంతకన్న దొరక లేదా?''

''దొరక్క కాదు. అది నా ప్రిన్సిపుల్''.

''ప్రిన్స్‌పులా? నువ్వేదో తమాషా మనిషిలా ఉన్నావే? అలా కూర్చో నీ గురించి వినాలి నేను'' అన్నాడా వ్యక్తి పిస్టల్ జేబులో పెట్టుకుంటూ.

దాంతో ధైర్యం వచ్చింది శివరాంకి. కుర్చీలో కూర్చొని తన గురించి అంతా చెప్పాడు.

''బావుంది ఆ అయిదు వందలూ నీకు నా ప్రెజెంటేషన్ అనుకో. ఇంక వెళ్ళిపో'' అన్నాడా వ్యక్తి.

''ఎందుకు'' ఎందుకలా అనుకోవాలి?''

''నువ్వు నాకు చేసిన హెల్ప్‌కి నీకు నా కానుక.''

''నేనేం హెల్ప్ చేశాను?'' విస్వెరపోతూ అడిగాడు శివరాం.

''నీ కథ నువ్వేసిన జోకు నేను వాడుకొంటాను నీ కథ వీలైతే ఓ కథ గానో, ఇంకా వీలైతే సీరియల్ లో ఓ పాయింటుగానో, లేదా టీవిలో సింగిల్ ఎపిసోడ్ గానో ఇంకా వీలైతే సినిమా కథకి ఓ చిన్న లైన్ గానో వాడుకొంటాను'' అన్నాడు.

''మీరు రచయితలా?''

''అవును''

''మరి ఆ వీడియో చూసి నోట్ వేసుకుంటున్నారు కదా అది కూడా ఇలాగే వాడుకొంటారా?''

''ఆహా! నిరభ్యంతరం''

''మరి మీరు రచయితలు కదా... సొంతంగా ఊహించి రాయకుండా ఇలా కాపీలు కొట్టేసి రాస్తే ఎలా?''

''దీన్ని కాపీ అనకూడదు. ఇన్‌స్పిరేషన్ అనాలి అయినా మన తెలుగు వాళ్ళకి ఇంగ్లీషు పుస్తకాలు చదవటం, ఇంగ్లీషు క్యాసెట్ లు చూడడంలాంటివి కష్టం కదా... అలాంటి వాళ్ళ కోసం శుభ్రంగా తెలుగు వాతావరణంతో నింపి తెలుగులో అందచేయడానికి మేం చేస్తున్న కృషి ఇది'' అన్నాడా రచయిత.

''అయినా ఒరిజనల్ గా మీకు దొరికే మూల్యం గాని, ప్రేరణ గాని మీ గుండెల్లోంచి మీ మేధస్సులోంచి వచ్చినట్టు కాదుగా అంచేత కాపీ అనే అనాలి మరి'' అన్నాడు శివరాం — ఆ కాస్త వ్యవధిలో ఏర్పడిన చనువుతో.

అలా అయితే నేనో ప్రశ్న వేస్తాను చెప్పు... కొంచెం చదువుకున్న వాడివి కదా...'' అంటూ ''మన ఆదికవి ఎవరు?'' అడిగాడు రచయిత.

''నన్నయ్య''

''నన్నయ్య రాసిన కావ్యం?''

''మహాభారతం''

''అది ఆయన సొంతమా? సంస్కృతంలో వ్యాసుడు రాసింది తెలుగులోకి దించేసిన బాపతే కదా? అలాగే భారతం మొత్తం అంతా సంస్కృతంటు తెలుగే కదా? అంతెందుకు రామాయణం వాల్మీకి తెలుగులో రాశాడా? దాన్ని కూడా మనం తెలుగులోకి అనువదించుకోలేదూ? మనం కొలిచే పురాణాలు నుంచే మొదలయింది మనకు ఇలా ఒక భాషలోంచి ఇంకో భాషలోకి దించేసే వ్యవహారం. మేం ఇంకా నయం లైన్ మాత్రమే తీసుకొని మిగిలినదంతా తెలుగు వాతావరణాన్ని నింపుకుంటూ మా సృజనాత్మకత చూపిస్తున్నాం. ఏమంటావ్?'' అన్నాడా రచయిత.

''అర్ధమైంది.... కాదు కాదు.... జ్ఞానోదయం అయింది. నేనిన్నాళ్లుగా వెతుకుతున్న వైట్ కాలర్ జాబ్ దొరికింది. ఆల్రెడీ దొంగతనాల్లో నాకు ఇన్నాళ్ళూ ఉన్న అనుభవం కూడా దీనికి పనికొస్తుంది. నన్ను ఆశీర్వదించండి'' అన్నాడు శివరాం.

అర్ధం చేసుకున్న ఆ రచయిత శివరాంని మన సారా దీవించాడు.


సంవత్సరం తిరిగేలోగా శివరాం పెద్ద రచయితల లిస్ట్‌లో చేరిపోయాడు.

# విటమిన్ విటమిన్...

ప్రతిమనిషి కదలిక దగ్గర నుంచి చేసె ప్రతి చిన్న పనికి విటమిన్ సహాయత ఎంతో అవసరం. విటమిన్‌లు లేనిదే ఏ జీవి జీవించదు. అప్పుడే పుట్టిన పసికందు నుంచి మొదలుకొని పండుముదుసలై మరణించే వరకు విటమిన్లు ఎంతో అవశ్యకం. అయితే ఈ విటమిన్ల వాడకం పట్ల మనమందరం ఎంతో నిర్లక్ష్యం చేస్తూ తీవ్ర జబ్బులను కొనితెచ్చుకుంటున్నాము. మనిషి పెరుగుదల అవశ్యకత ఎంతైన ఉంది. మనం ప్రతిరోజు తీసుకునే ఆహారంలో అన్ని రకాల విటమిన్లు ఉండాలని డాక్టర్లు ఎంతో చెబుతున్న మనం వాటిగురించి పెడచెవిన పెడుతుంటాం. విటమిన్ లోపం వల్ల దీర్ఘకాలిక వ్యాధులకు లోనుకావడమే కాకుండా మరణించే ప్రమాదం కూడా లేకపోలేదు.

విటమిన్ల ప్రాధాన్యత గురించి పాఠకులకు సమగ్రంగా వివరాలు అందించాలని సంకల్పించాము.

విటమిన్ల వల్ల లాభాలు, నష్టాల గురించి వారం వారం పాఠకులకు ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్. ఎం. దేవగౌడ్ చక్కని సలహాలు అందజేస్తారు.



చిరునామా:-
డాక్టర్. ఎం. దేవగౌడ్
డైరెక్టర్
శ్రీ వెంకటరమణ నర్సింగ్ హోం,
ఇ.నె. 11-3-664/107,
సికింద్రాబాద్- 500 361.
శ్రీ కృష్ణ హాస్పిటల్,
మేడ్చల్, రంగారెడ్డి జిల్లా.